క్లుప్తంగా

ఐదుగురికి స్వల్పగాయాలు

సీతంపేట: మండలంలోని బంగారిగూడ వద్ద ఆటో బోల్తాపడింది. మంగళవారం ఉదయం జరిగిన ఈ ఘటనలో ఐదుగురు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. ఆటో అదుపు తప్పడంతోనే ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. అదృష్టవశాత్తు ఆటోలో ఉన్న వారిలో ఏ ఒక్కరికీ పెద్దగా గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. త్రుటిలో పెద్ద ప్రమాదం తప్పిందని ఆ ప్రమాద దృశ్యాన్ని చూసిన వారు అంటున్నారు.

ప్రభుత్వ పాఠశాలలో చేరుతున్న అంగన్వాడీ చిన్నారులు



వెంగళరాయపురం ప్రాథమిక పాఠశాలలో చేరుతున్న చిన్నారులు

బలిజిపేట: మండలంలోని అంగన్వాడీ కేంద్రాలలో 5సంవత్సరాలు పూర్తయిన చిన్నారులను సంబంధిత ప్రభుత్వ పాఠశాలలో ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది చేర్పిస్తున్నారు. అందులో భాగంగా వెంగళరాయపురంలో నలుగురు చిన్నారులను పాఠశాలలో మంగళవారం చేర్పించారు. మండలంలోని 94కేంద్రాలలో 5సంవత్సరాలు పూర్తయినవారు 160మంది వరకు విద్యార్థులు ఉన్నారని వారిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించనున్నామని ఇన్‌చార్జ్ సీడీపీఓ సులేఖ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, ఉపాధ్యాయుడు ప్రసాద్, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త తీయించండి సారూ..!

పార్వతీపురం టౌన్: పట్టణంలోని శ్రీవారి సన్నిధి కల్యాణ మంటపం ఎదురుగా చెత్తవేసి మంగళవారానికి 7 రోజులు అయింది. కానీ మున్సిపాలిటీ సిబ్బంది పట్టించుకోవడం లేదు. మున్సిపల్ కమిషనర్ స్పందించి చెత్తను తొలగింపజేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఏఎన్‌ఎంలను విధుల్లోకి తీసుకోవాలి

సాలూరు: గిరిజన సంక్షేమ, ఆశ్రమ పాఠశాలలు, కళాశాలల్లో గతంలో పనిచేసిన ఆదివాసీ ఆరోగ్య సిబ్బంది ఏఎన్‌ఎంలను విధుల్లోకి తీసుకోవాలని, గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తాడంగి సాయిబాబు, పాలక రంజిత్‌కుమార్‌లు మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. చాలీచాలని జీతాలతో, సమయానికి జీతాలు అందకపోయినా వారు గిరిజన విద్యార్థులకు 24 గంటలు వైద్యసేవలు అందించారని పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



రాష్ట్ర వైద్యారోగ్య శాఖ డైరెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఉద్యోగసంఘాల కన్వీనర్ నూతుల పాటి భరత్ భూషణ్ రాజ్

పార్వతీపురంటౌన్: పీహెచ్‌సీల్లో సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని ఉత్తరాంధ్ర ఎస్సీ, ఎస్టీ ఉద్యోగసంఘాల కన్వీనర్ నూతుల పాటి భరత్ భూషణ్ రాజ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం విజయవాడ రాష్ట్ర వైద్యారోగ్య శాఖ డైరెక్టర్‌ను కలిసి స్టాఫ్ నర్సుల జీతాల విషయమై వినతి పత్రం అందజేశారు. వైద్య ఆరోగ్య శాఖలో జీఓ నంబర్ 32, 143 వల్ల ఉత్పన్నమయ్యే సమస్యలు పరిష్కరించి ఉద్యోగులను ఆదుకోవాలని కోరారు. '0' సర్వీసుతో సాధారణ బదిలీలు జరపాలని కోరారు

ప్రకృతి వ్యవసాయ సిబ్బందిని ఆదుకోవాలి

పార్వతీపురంటౌన్: ప్రకృతి వ్యవసాయ సిబ్బందిని ఆదుకోవాలని సీఐటీయూ నాయకుడు గొర్లి వెంకటరమణ కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన ప్రకృతి వ్యవసాయ డీపీఎం షన్ముఖరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బకాయి గౌరవ వేతనాలు చెల్లించాలని, వివిధ కారణాలతో కిందిస్థాయి క్యాడర్లను విధుల నుంచి తొలగించిన వారిని తక్షణం విధుల్లోకి తీసుకోవాలన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రతి నెల గౌరవేతనం సకాలంలో ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ప్రసాద్, లక్ష్మణరావు, శ్రీరాములు, రామారావు, నాగరాజు, సీఐటీయూ నాయకులు యమ్మల మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.

పత్తి సాగు పనుల్లో రైతులు

సీతానగరం: ఇటీవల కురిసిన వర్షాల కారణంగా ఇది వరలో మట్టి నమూనాలు చేసిన మండలంలోని భూముల్లో పలుగ్రామాల రైతులు పత్తి విత్తనాలు వేసే పనుల్లో నిమగ్నమయ్యారని ఏఓ ఎస్.అవినాష్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన బక్కుపేట, గెడ్డలుప్పి, కొత్తవలస, బగ్గందొరవలస, బీకే పురం, దయానిధిపురం, గుమ్మిడివరం, రామవరం, రెడ్డివానివలస గ్రామాల్లోని మెట్ట భూములు, వర్షాధార భూముల్లో ఖరీఫ్ సీజన్‌లో పత్తి పంట సాగు చేయడాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 850 ఎకరాల్లో రైతులు పత్తిపంట సాగు చేస్తున్నారన్నారు. గిట్టుబాటు ధర పలకడం, కొనుగోలుదారులు గ్రామాల్లోనే కొనుగోలు చేయడంతో పత్తిపంటసాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారని తెలియజేశారు.

పారిశుధ్య పనులకు ప్రాధాన్యం

పాలకొండ రూరల్:

వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పారిశుధ్య పనులకు ప్రాధాన్యమివ్వాలని ఎంపీడీవో ఎస్.రామకృష్ణ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం సమావేశమైన ఆయన పలు సూచనలు చేశారు. సర్పంచ్‌లను సమన్వయం చేసుకుంటూ గ్రామీణ ప్రాంతాల పరిశుభ్రతపై దృష్టిసారించాలన్నారు. వీధులు, కాలువలు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. దోమల కారణంగా మలేరియా, డెంగీ జ్వరాలు వస్తాయని, వాటి బారినపడకుండా కాలువలు, మురుగునీటి నిల్వల వద్ద దోమల నివారణ మందు పిచికారీ చేయించాలన్నారు. అలాగే రక్షిత మంచినీటి పథకాలు, తాగునీటి ట్యాంకులు, బోరుబావుల్లో క్లోరినేషన్ చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం మండల పరిధిలోని గరుగుబిల్లి, లుంబూరు, భాసూరు, అర్దలి గ్రామాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను ఆయన పరిశీలించి, పలు సూచనలు చేశారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా పాటించాలని గ్రామస్తులకు తెలిపారు.



వీరఘట్టం బార్నాల వీధిలో మినీ జేసీబీతో కాలువలోని పూడికలు తీయిస్తున్న దృశ్యం

వీరఘట్టం: స్థానిక మేజరు పంచాయతీలో మున్సిపల్ ఈవో రాము ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు మంగళవారం చేపట్టారు. ప్రధాన వీధులు, రోడ్లలో పేరుకుపోయిన చెత్తాచెదారం, కాలువల్లోని పూడికలను మినీ జేసీబీలతో తొలగించారు. అనంతరం డంప్‌ను డంపింగ్‌యార్డుకు తరలించారు.



పాలకొండ రూరల్: భాసూరు వీధి కాలువల్లోని పూడికలు తీయిస్తున్న సర్పంచ్ గురునాయుడు

విత్తనాల పంపిణీ

కురుపాం: మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు వరి విత్తనాలు మంగళవారం పంపిణీ చేశారు. ఖరీఫ్ సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచుతున్నామని వ్యవసాయాధికారి పువ్వల నాగేశ్వరరావు తెలిపారు. మండలంలో మొత్తం 1864 మందికి 1098.6 క్వింటాళ్ల వరి విత్తనాలను తొలి విడతలో అందజేశామని, రెండో విడతలో 80.2 క్వింటాళ్ల వరి విత్తనాలు పంపిణీ చేయనున్నామని పేర్కొన్నారు.



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

పరామర్శ

భామిని: మండలంలోని బాలేరుకు చెందిన ఉపాధి హామీ పథకం టీఏ మీనక తిరుపతిరావు సోమవారం రాత్రి మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నేత కాగితాపల్లి కృష్ణారావు, సర్పంచ్ జామి ప్రభాకర్, వీరఘట్టం ఎస్‌ఐ కళాధర్, భామిని, సీతంపేట ఉపాధి హామీ పథకం ఏపీవోలు తులసీదాస్, విద్యాసాగర్‌లు ఆ గ్రామానికి మంగళవారం వెళ్లి, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ఆయన మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. తిరుపతిరావు ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని వేడుకున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

హెల్త్ వెల్‌నెస్ కేంద్రాల ద్వారా మెరుగైన సేవలందించాలి



గంగాపురం హెల్త్ వెల్‌నెస్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా మలేరియా నివారణ అధికారి జగన్‌మోహనరావు

పార్వతీపురంటౌన్: గ్రామీణ ప్రాంత ప్రజలకు హెల్త్ వెల్‌నెస్ కేంద్రాల ద్వారా మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు సూచించారు. ఈ మేరకు మంగళవారం ఆయన మండలంలోని గంగాపురం, చినబొండపల్లి హెల్త్ వెల్‌నెస్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏ విధమైన ఆరోగ్య సమస్యలతో ఉన్నవారు ప్రతిరోజూ అక్కడ వైద్య సేవలు వినియోగించుకుంటుండగా వారికి నిర్వహిస్తున్న పరీక్షలు ఆరోగ్య తనిఖీల వివరాలను రికార్డుల్లో ఆయన పరిశీలించారు. జ్వర లక్షణాలతో ఉన్న వారికి జాప్యం లేకుండా వెంటనే నిర్ధారణ పరీక్షలు చేసి అందుబాటులో ఉంచిన మందులు పరిశీలించి దీర్ఘకాలిక రోగుల ఆరోగ్యం ఏ మేరకు కుదుటపడుతుందో పర్యవేక్షణ చేయాలని సూచించారు. మలేరియా, డెంగీ తదితర సీజనల్ జ్వరాలు గుర్తిస్తే జ్వరం తగ్గేవరకు పర్యవేక్షిస్తూ ఆ ప్రదేశంలో నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. డ్రైడే ప్రతీ రోజూ నిర్వహిస్తూ ప్రజలు డ్రైడే పాటించేలా చైతన్య పర్చాలని చెప్పారు. వెల్‌నెస్ కేంద్రాల్లో ఉన్న వైద్య సేవలు ఆ పరిధిలో ఉండే ప్రజలకు అందేలా చూడాలన్నారు. ఆరోగ్య తనిఖీ వివరాలు రికార్డుల్లో పూర్తిస్థాయిలో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంఓ సూర్యనారాయణ, సూపర్‌వైజర్స్ జయగౌడ్, కృష్ణ, వైద్య సిబ్బంది పద్మావతి, భారతి, కమల, ధనలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్స్, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్ స్క్రీనింగ్‌పై శిక్షణ

పార్వతీపురంటౌన్: రాష్ట్రవ్యాప్తంగా త్వరలో చేపట్టనున్న కేన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమం కోసం సిబ్బందికి అవసరమైన శిక్షణ అందిస్తున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ, ఎన్‌సీడీ ప్రాజెక్ట్ జాయింట్ డైరెక్టర్ డా. నరసింగరావు తెలిపారు. జిల్లా ఆస్పత్రి సమావేశ మందిరంలో నెలరోజుల పాటు నిర్వహించనున్న 'కేన్సర్ స్క్రీనింగ్ శిక్షణ శిబిరాన్ని' మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో గల వైద్యాధికారులు, స్టాఫ్‌నర్సులు, ఏఎన్‌ఎంలకు బ్యాచ్‌కు 50మంది చొప్పున మూడు రోజులపాటు శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమం నెలరోజుల పాటు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో పీఓ ఆర్బీఎస్‌కే డా.పీఎల్.రఘుకుమార్, డా.శ్యామల పాల్గొన్నారు.

రవాణా శాఖ ప్రత్యేక డ్రైవ్

పాలకొండ/కొమరాడ: పార్వతీపురం మన్యం జిల్లాలో రవాణా శాఖ ప్రత్యేక డ్రైవ్ చేపట్టింది. ఇందులో భాగంగా పార్వతీపురం సహాయ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌లు ఎస్.రమేష్‌కుమార్, జి.సత్యనారాయణ, బి.కాశీరాంనాయక్ ఆధ్వర్యంలో పాలకొండ, కొమరాడ మండలాల్లో మంగళవారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులకు మోటార్ వాహన చట్టాలపై అవగాహన కల్పించారు. పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్న వాహనాలను ఆపి, వాహన చోదకులను హెచ్చరించారు. పరిమితికి మించి ప్రయాణికులను తరలించవద్దని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని తెలిపారు. సరుకు రవాణా వాహనాల్లో కూడా ప్రయాణికులను తరలించవద్దని, నిబంధనల మేర వాహనాలు నడపకపోతే సీజ్ చేస్తామన్నారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్యాలకు చేర్చాలన్నారు.



వాహన తనిఖీలు చేస్తున్న రవాణా శాఖ అధికారులు

స్టూడెంట్ కిట్లు అందజేత

భామిని: మండలంలోని బాలేరు గ్రామ ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు మంగళవారం అందజేశారు. విద్యా సంవత్సరం ఆరంభంలోనే పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, స్కూల్ బ్యాగులు అందడంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



స్టూడెంట్ కిట్లు అందుకున్న విద్యార్థులతో పాఠశాల సిబ్బంది

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోండి

- మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ ఉరిటి రామారావు

గరుగుబిల్లి: మండల సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎంపీపీ ఉరిటి రామారావు అధికారులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా సుంకి ప్రాథమిక పాఠశాలకు వంట షెడ్డు, ప్రహరీ గేటు ఏర్పాటు చేయాలని సర్పంచ్ కె.రవీంద్ర కోరారు. రావుపల్లి, సుంకి, రావివలస తదితర గ్రామాలకు చెందిన సర్పంచ్‌లంతా కలిసి కుక్కకాటు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వాటిని(కుక్కల) నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై స్పందించిన ఇన్‌చార్జ్ ఎంపీడీవో అర్జునరావు..కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు భూముల సర్వేపై అభ్యంతరాలను స్వీకరించడం జరుగుతుందని హెచ్‌డీటీ లక్ష్మీకుమార్ తెలిపారు. గర్భిణులకు సుఖప్రసవం జరిగేలా సంపూర్ణ పోషణ కిట్లను అందజేస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణకుమారి వెల్లడించారు. జూలై మూడో వారంలో తోటపల్లి ప్రాజెక్టు పాత కుడికాలువ ద్వారా సాగునీటిని సరఫరా చేయనున్నామని ఆ శాఖ ఏఈ వెంకటరమణ అన్నారు. సాగునీటి కాలువల మరమ్మతులు నిర్వహించి, సాగునీరు విడుదల చేయాలని రావివలస, సుంకి, మరుపెంట గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు కోరారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, ఈవోపీఆర్‌డీ ఎల్.గోపాలరావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ రామారావు

విధుల్లో చేర్చుకోవాలని వినతి

పాలకొండ: తమను విధుల్లో చేర్చుకోవాలని రాజీనామా చేసిన వార్డు వలంటీర్లంతా స్థానిక నగరపంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావును మంగళవారం కోరారు. ఎన్నికల ముందు తాము రాజీనామాలు చేశామని, ప్రస్తుతం విధుల నిర్వహణకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. గత ఐదేళ్లలో ప్రజలకు సేవలందించిన తమకే ప్రాధాన్యమివ్వాలన్నారు.



నగరపంచాయతీ కార్యాలయం ఎదుట రాజీనామా చేసిన వలంటీర్లు

విద్యార్థులకు అందుబాటులో ఉండండి

వీరఘట్టం: వీఆర్‌వోలంతా విద్యార్థులకు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ కె.జయప్రకాష్ సూచించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో వీఆర్‌వోలతో మంగళవారం సమావేశమైన ఆయన.. జూన్ నెల అడ్మిషన్ల సమయం అని, ఈ సమయంలో విద్యార్థులకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు కావాల్సి ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో ఆయా ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకునే విద్యార్థులకు 24 గంటల్లోగా అందజేయాలన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ జయప్రకాష్

ఉచిత నేత్రవైద్య శిబిరం రేపు

వీరఘట్టం: మండలంలోని వండవ గ్రామ షిర్డీ సాయి ధ్యాన మందిరంలో ఈ నెల 20వ తేదీన ఉచిత నేత్రవైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త మజ్జి సింహాచలం ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. విశాఖ శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే ఈ శిబిరంలో వివిధ కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందివ్వడం జరుగుతుందన్నారు. ఆపరేషన్లు అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయడం జరుగుతుందన్నారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రాయితీపై వరి విత్తనాల పంపిణీ

సీతానగరం: మండలంలోని ఆర్బీకేల్లో 2024 ఖరీఫ్ వరిసాగుకు అవసరమైన వరివిత్తనాలను వ్యవసాయ సహాయకులు రైతులకు పంపిణీ చేస్తున్నారు. ఆర్బీకేల్లో ఎవరి ప్రమేయం లేకుండా నేరుగా రైతులకు అన్ని కేంద్రాల్లో వరివిత్తనాలు పంపిణీ చెయ్యడం పూర్తి కావచ్చింది. విత్తనాల కొనుగోలు ప్రక్రియ అక్కడక్కడ జరుగుతోంది. ఆర్బీకేల్లో విత్తనాల రకాలు-ఎంటీయూ 1064-30 కేజీల బరువుగల బ్యాగ్ ప్రభుత్వ ధర రూ.1194లు కాగా రూ.300 రాయితీపై ఇస్తున్నారు, ఎంటీయూ 1121 రకం వరివిత్తనాలు 30 కేజీల ధర రూ.1194లు కాగా రూ.300 రాయితీ ఇచ్చారు. అన్ని రకాల విత్తనాలను ప్రభుత్వ ధరపై రాయితీ ఇచ్చి రైతలకు పంపిణీ చేశారు. మండలంలోని రైతులకు అవసరమైన విత్తనాలు పంపిణీ చేయడం పూర్తయింది. అత్యవసర పరిస్థితుల్లో పంపిణీ చేయడానికి పెదబోగిలి ఆర్బీకేలో నిల్వలుంచారు.



పణుకుపేటలో రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఆర్బీకే సిబ్బంది

అక్రమంగా లేఅవుట్లు వేసిన వారికి నోటీసులు

వీరఘట్టం: అక్రమంగా లే అవుట్లు వేసిన వారికి నోటీసులు ఇస్తున్నట్లు సుడా(శ్రీకాకుళం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) బిల్డింగ్స్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ తెలిపారు. మండల కేంద్రానికి మంగళవారం విచ్చేసిన ఆయన నడుకూరు-వీరఘట్టం ప్రధాన రోడ్డు పక్కన ఎటువంటి అనుమతులు లేకుండా వేసి ఉన్న ఐదు లే అవుట్లను పరిశీలించారు. సుడా నిబంధనల ప్రకారం రోడ్లు ఉంటేనే అనుమతులు ఇవ్వడం జరుగుతుందని, లేనిపక్షంలో ఈ లేఅవుట్లలో సైట్లు కొనుగోలు చేసిన వారే ఇబ్బందులు పడతారన్నారు. కొనుగోలుదారులు కూడా సుడా నిబంధనలు ఉన్నాయా లేదా అనే విషయం తెలుసుకుని, సైట్లు కొనుగోలు చేయాలన్నారు.



వీరఘట్టం హైస్కూల్ ఎదురుగా అక్రమంగా వేసిన లేఅవుట్

ముమ్మరంగా వాహన తనిఖీలు

పాలకొండ రూరల్: పాలకొండ-సీతంపేట, పాలకొండ-రాజాం రోడ్లతో పాటు స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో పోలీసులు మంగళవారం వాహన తనిఖీలు ముమ్మరంగా చేపట్టారు. అటువైపుగా వచ్చే వాహనదారులను ఆపి, వారి వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్‌లను పరిశీలించారు. ఆయా ధ్రువపత్రాలు లేని వారికి అపరాధ రుసుం విధించారు. అనంతరం ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. మద్యంతాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపవద్దని, మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని తెలిపారు. వాహనాలతో బయటకు వచ్చేటప్పుడు వాహనాల ధ్రువపత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా వెంట తీసుకురావాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వాహన యజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు.



వాహనదారులకు సూచనలిస్తున్న ఎస్‌ఐ ప్రశాంత్‌కుమార్

అన్నసంతర్పణ

పాలకొండ రూరల్: హనుమాన్ జయంత్యుత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా మండలంలోని బెజ్జి గ్రామంలో ఉన్న అభయాంజనేయస్వామి ఆలయం వద్ద అన్నసంతర్పణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు కార్యక్రమంలో పాల్గొని, స్వామి వారి అన్నప్రసాదం స్వీకరించి, ఆరగించారు. అంతకుముందు స్వామి వారిని భక్తులు దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ఆలయ కమిటీ సభ్యుల నేతృత్వంలో భజన పోటీలు నిర్వహించారు.



అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

సీతంపేట: ట్రాఫిక్ నిబంధనలు పాటించి, రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని ఎస్‌ఐ జగదీష్‌నాయుడు అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆటో, వ్యాన్‌ల డ్రైవర్లతో మంగళవారం సమావేశమైన ఆయన ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. వాహనాలతో రోడ్లపైకి వచ్చేటప్పుడు వాహనాల ధ్రువపత్రాలు తప్పనిసరిగా వెంట తీసుకురావాలన్నారు. అలాగే మద్యం తాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపవద్దన్నారు. వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దన్నారు. మితిమీరిన వేగం పనికిరాదని, వాహనాలు నడిపేటప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు.



వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలు వివరిస్తున్న ఎస్‌ఐ జగదీష్‌నాయుడు

నేత్ర శస్త్రచికిత్సకు పయనం

కురుపాం:

గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లోని సచివాలయాల పరిధిలో గతంలో నిర్వహించిన ఉచిత నేత్రవైద్య శిబిరాల్లో కంటి ఆపరేషన్లకు ఎంపికైన వారు తగరపువలసలోని ఎన్‌ఆర్‌ఐ ఆస్పత్రికి మంగళవారం పయనమయ్యారు. వీరంతా కెటరాక్ట్, టెరీజియం సమస్యలతో బాధపడుతున్నారని, వీరికి ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా కంటి వెలుగు సెల్ నేత్ర వైద్యాధికారి జీరు నగేష్‌రెడ్డి తెలిపారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం నుంచి వీరిని ప్రత్యేక బస్సులో తరలించామని, చికిత్స సమయంలో ఉచితంగా మందులు, భోజనం, వసతి సదుపయాలు కల్పిస్తామన్నారు.



కంటి ఆపరేషన్లకు బస్సులో వెళ్లేందుకు సిద్ధమైన రోగులు

ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనది..

వీరఘట్టం: ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనదని, మెరుగైన సమాజం ఉపాధ్యాయులతో రూపుదిద్దుకుంటుందని పాలకొండ ఉప విద్యాశాఖాధికారి పర్రి కృష్ణమూర్తి అన్నారు. మండలంలోని తలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవల పదవీ విరమణ చేసిన సోషల్ అసిస్టెంట్ కె.సంపూర్ణంను మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఉద్యోగికి పదవీ విరమణ తప్పక వస్తుందని, వృత్తిలో మనం చేసే పనే మనకు మంచి గుర్తింపునిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు డి.గౌరినాయుడు, ఆర్.ఆనందరావు, ప్రధానోపాధ్యాయుడు అప్పారావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



టీచర్ సంపూర్ణంను సన్మానిస్తున్న ఉప విద్యాశాఖాధికారి కృష్ణమూర్తి, ఉపాధ్యాయ సిబ్బంది

విత్తనాల పంపిణీ పూర్తి చేయండి

పాలకొండ: ఖరీఫ్ సాగుకు సంబంధించి, రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేయడం పూర్తి చేయాలని వ్యవసాయ శాఖ ఏడీ రత్నకుమారి సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని కొండాపురం గ్రామ రైతు భరోసా కేంద్రాన్ని ఆమె మంగళవారం సందర్శించి, రైతులకు పంపిణీ చేస్తున్న విత్తనాలపై ఆరాతీశారు. అనంతరం రైతులతో ఆమె మాట్లాడుతూ వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటిస్తూ వ్యవసాయం చేస్తే అధిక దిగుబడులు వస్తాయన్నారు. రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలని, సేంద్రియ ఎరువులను ఎక్కువగా వినియోగించాలన్నారు. ఇప్పటికే వెదలు వేసిన రైతులు కలుపుమొక్కల నివారణకు ప్రాధాన్యమివ్వాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ పి.నీలిమ పాల్గొన్నారు.



ఆర్‌బీకేలో విత్తనాల నిల్వలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ ఏడీ రత్నకుమారి